# ట్రాప్

అంతర్జాతీయ క్రీడోత్సవాలని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి నగరంలోని శాంతిభద్రతల విషయం మీద వున్నత పోలీసు అధికారులతో చర్చించాడు. ఫలితంగా కొన్ని నిర్ణయాలని తీసుకున్నాడు.

వీటిలో ఒకటి వివిధ దేశాల క్రీడాకారులని ఆకర్షించే వేశ్యల నిరోధం. అలాంటి సందర్భాల్లో రాష్ట్రంలోని నలుమూలల నించి జేబు దొంగల్లా వేశ్యలు కూడా నగరానికి తరలి వస్తారు. కాబట్టి వాళ్ళని గుర్తించి పట్టుకుని వెనక్కి పంపాలని నిశ్చయించారు. అందుకోసం పోలీసు ఉన్నతాధికారులు 'ఏంటీ ప్రాస్టిట్యూట్స్ స్క్వాడ్'ని తక్షణం ఏర్పాటు చేసారు. అందులోకి సమర్థులైన వారినే ఎంపిక చేశారు.

నగరంలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్‌లో పని చేసే హెడ్‌కానిస్టేబుల్ శివరావు గతంలో ఎందరో వేశ్యలని, విటులని పట్టుకున్నాడు. ఈ రకం నేరాల విషయంలో అతను చూపించిన అసమాన సమర్థత కారణంగా శివరావుని 'ఏంటీ ప్రాస్టిట్యూట్ స్క్వాడ్'లోకి తీసుకున్నారు. ఇలా నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో వున్న స్టాఫ్ నించి మొత్తం ఏభైమందిని నూతనంగా ఏర్పాటు చేసిన ఈ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు.

శివరావు లోకల్‌గా చాలాకాలంనుంచి వృత్తిలో వున్న వేశ్యలని గుర్తించగలడు కాని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కొత్త వేశ్యల మొహాలు తెలీవు. అప్పటికీ అలాంటి వారు చాలామంది వచ్చారని అతనికి ఇన్‌ఫార్మర్స్ ద్వారా రిపోర్టులందాయి. వారిని ఎలా గుర్తించాలా అని తీవ్రంగా ఆలోచించాడు. చివరికి ఓ ఉపాయం తట్టిందతనికి.

* * *

ఆ రోజు చీకటి పడుతుండగా శివరావు నగరంలో రద్దీగా వుండే నాంపల్లి ప్రాంతంలో విటుడుగా నటిస్తూ, వేశ్యల కోసం తిరగసాగాడు. రోడ్డుమీద ఒంటరిగా వెళ్ళే ఆడవాళ్ళకి రహస్యంగా సైగలు చేయసాగాడు. గృహిణులు అతని సైగలకి చికాకుగా లేదా అసహ్యంగా అతని వంక చూస్తూ వెళ్ళసాగారు.

చివరికి అతని ప్రయత్నం ఫలించింది. ఓ యువతి అతని సైగలకి అతని వంక చిరునవ్వుతో చూస్తూ అడిగింది.

"ఏం కావాలబ్బాయా?"

"ఏదో ఒకటి కావాలి కాని ఏం తీసుకుంటావు?" అడిగాడు శివరావు ఉత్సాహంగా చూస్తూ.

"ఎంత సేపు? రాత్రంతానా?"

"రాత్రంతానా? ఇంకా నయం, గంటకి"

ఆమె తన రేటు చెప్పింది.

"కొత్త మొహంలా వున్నావే? మన్దేవూరు?" అడిగాడు శివరావు.

"పెద్దాపురం"

"ఎప్పుడొచ్చావు?"

"నిన్ననే"

"ఇంకా నీతో ఎంతమంది వచ్చారేమిటి?"

"ఒక్కత్తినే"

"స్కూటర్ ఎక్కు"

"మళ్ళీ తెచ్చి నన్నిక్కడే వదిలేయాలి" హెచ్చరించిందామె"

"అలాగే"

శివరావు తన స్కూటర్‌మీద ఆమెని ఎక్కించుకున్నాడు. కొద్ది దూరం వెళ్ళాక రెడ్‌లైట్ పడ్డచోట ట్రాఫిక్ కానిస్టేబుల్ శివరావు స్కూటర్‌ని ఆపి పక్కకి తీయమన్నాడు. శివరావు స్కూటర్‌ని పక్కకి తీసి, తన డ్రైవింగ్ లైసెన్స్, బండి కాగితాలు తీసి చూపించబోయాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్ వాటిని చూడలేదు. ఇంతలో ఓ పోలీస్ జీపు వచ్చి శివరావు పక్కన ఆగింది. అందులోంచి ఓ కానిస్టేబుల్ దిగి చెప్పాడు శివరావుతో.

"నేను వెనక కూర్చుంటాను. స్కూటర్‌ని జీపు వెనక పోనీ"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు శివరావు.

"ఎందుకో పోలీస్ స్టేషన్‌లో తెలుస్తుంది కాని పద"

శివరావు మౌనంగా తన జేబులోంచి ఐడెంటిటీ కార్డ్ తీసి జీపులోని ఎస్ఐకి చూపించాడు.

దాన్ని చూడగానే ఎస్ఐ మొహంలో విస్మయం కనిపించింది. తర్వాత అతను ఫక్కున నవ్వి చెప్పాడు...

"భలేవారే. మీ ఇద్దరూ 'ఏంటీ ప్రాస్టిట్యూట్స్ స్క్వాడ్'లో పనిచేస్తూ కూడా ఒకరికొకరు తెలీదా?.. ఇతను శివరావు, ఈమె సుకుమారి. వరంగల్ నించి డిప్యుటేషన్ మీద ఈ స్క్వాడ్‌లో పనిచేయడానికి ప్రత్యేకంగా వచ్చింది"

వాళ్ళని ఒకరికొకర్ని పరిచయం చేయగానే వాళ్ళిద్దరూ తబ్బిబ్బు పడ్డారు.

- మల్లాది

